సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



విద్యుత్ షాక్‌తో తల్లి, కుమారుడు మృతి

పొలంలోని పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన తల్లీ, కుమారుడు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడిన విషాద ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. -8లో



వైభవోపేతం.. బ్రహ్మోత్సవం

పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.2/17.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 17.4 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

14న రోలర్ స్కేటింగ్ క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల రోలర్ స్కేటింగ్ పురుషుల, మహిళల క్రీడా పోటీలు ఈ నెల 14వ తేదీన ఉదయం 6.30 గంటలకు వైవీయూలో నిర్వహించనున్నట్లు వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల విభాగం క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే క్రీడాకారుల వయసు 2024 జులై 1వ తేదీ నాటికి 17- 25 ఏళ్లలోపు ఉండాలన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో చదువుతున్న వారు అర్హులని వివరించారు. వివరాలకు 9000294626 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

కడప అర్బన్: విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రత్యేక పరిపాలనాధికారి రంగస్వామి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఎఫ్.ఎన్.ఓ(ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ) సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరయ్యేటపుడు సమయపాలనను పాటించాలన్నారు. ఎవరైనా చెప్పకుండా గైర్హాజరైనా, ఆలస్యంగా వచ్చినా వారిపై చర్యలు తప్పవన్నారు. ఉదయం పూట విధులకు 8 గంటలకు హాజరు కావాల్సి ఉండగా ఎవరూ సమయపాలన పాటించడం లేదని మండిపడ్డారు. ఎఫ్ఎన్ఓలకు కేటాయించిన యూనిఫాంను తప్పకుండా ధరించాలన్నారు. డ్యూటీచార్ట్‌ను తప్పకుండా గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ వేయాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు. తమకు కేటాయించిన విధులన సక్రమంగా నిర్వహించి ఆసుపత్రికి, అధికారయంత్రాంగానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓలు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ గీత, డాక్టర్ సునీత, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురీలత, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిరమ్మ, గంగులమ్మ, హెడ్ నర్స్ గౌరితో పాటు ఎఫ్.ఎన్.ఓలు పాల్గొన్నారు.

మార్చి 5 నుంచి ఒంటిమిట్టలో మహాసంప్రోక్షణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఇక్కడ జరుగుతున్న జీర్ణోద్ధరణ మరమ్మతులు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం జేఈఓ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు బాలాలయం నిర్వహించినట్లు తెలిపారు. సకాలంలో ఆలయ పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని టీటీడీ అధికారులను కోరారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఆలయంలో మహా సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించనున్నట్లు తెలియజేశారు. కడప జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం జేఈఓ కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ పీవీ నటేష్ బాబు, విజీఓ సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వంపై గుర్రు!

కూటమి ప్రభుత్వంలోకి 'చంద్ర'ముఖి పూర్తిగా ఆవహించింది. ఎప్పట్లానే ఉపాధ్యాయులను అనుమానించడం మొదలుపెట్టింది. 'తల్లికి వందనం' అమలు చేయడానికి మనసు రాక ... మెగా డీఎస్సీ హామీ అమలు చేయలేక కుట్రలకు తెరతీస్తోంది. తాజాగా తనిఖీల పేరిట గురువులనే అవమానిస్తోంది.

- తనిఖీల పేరుతో వేధిస్తున్నారని టీచర్ల ఆవేదన
- థర్డ్ పార్టీ పేరుతో తనిఖీలపై అసహనం
- టీచర్ పోస్టులను తగ్గించడానికే చేస్తున్నారని ఆరోపణలు



కడప నగరంలోని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తున్న సీకేదిన్నె మండల ఎంఈఓ వెంకట్రామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. ఉన్నతాధికారుల తనిఖీలు ఒకెత్తయితే.. థర్డ్ పార్టీ తనిఖీల పేరిట తమను అనుమానిస్తూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా పాఠశాలల్లో పిల్లల వాస్తవ సంఖ్యపై విచారణ మొదలు పెట్టించింది. తొలుత ఆ మండలంలో పనిచేసే ఎంఈఓతోపాటు క్లస్టర్ హెచ్ఎంలతో పిల్లల స్ట్రెంత్‌పై విచారణ జరిపించింది. అది చాలదన్నట్లు తాజాగా ఒక మండలాన్ని పక్క మండలాల ఎంఈఓలతో తనిఖీలు నిర్వహిస్తోంది. అంతటితో ఆగిందా అంటే లేదు.. రెవెన్యూ అధికారులతో తనిఖీలు చేయిస్తామని చెబుతోంది. దీనిపై ఉపాధ్యాయులు, సంఘ నేతలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా....

తమ పార్టీ ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా ఉంటుందని..., ఉపాధ్యాయుల సలహాలను తీసుకుని ముందుకు వెళ్తుందని విద్యాశాఖ మంత్రి చెబుతున్నా ఆచరణలో అది అమలు కావడం లేదు. పైగా ఉపాధ్యాయులను దొంగలుగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపై థర్డ్ పార్టీ తనిఖీ పేరుతో పక్క మండలాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులతో ప్రతి పాఠశాలను తనిఖీ చేయించడం ముమ్మాటికీ తమను అనుమానించడమేనని మండిపడుతున్నారు. త్వరలో రెవెన్యూ డిపార్టుమెంట్ వారితో కూడా థర్డ్ పార్టీ విచారణ జరిపించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సంబంధించి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మీద థర్డ్ పార్టీ తనిఖీలను నిర్వహించిన చరిత్ర లేదు.

ఎంఈఓలనూ అనుమానించినట్లే!

పాఠశాలల్లో ప్రతి రోజు విద్యార్థుల సంఖ్యను, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తుంటారు. అదే విధంగా బయోమెట్రిక్ కూడా వేయిస్తారు. అయినప్పటికీ విద్యార్థుల వాస్తవ సంఖ్య పేరుతో మండల విద్యాశాఖ అధికారులను, క్లస్టర్ హెచ్ఎం చేత ప్రతి పాఠశాలను తనిఖీ చేయించి విద్యార్థుల సంఖ్యను వివరాలను తీసుకున్నారు. ఇది సరిపోదని మళ్లీ థర్డ్ పార్టీ విచారణ పేరుతో పక్క మండలాల ఎంఈఓల ద్వారా తనిఖీలు చేయించడమంటే తమను అవమానించినట్లే అవుతుందని ఇది వరకు తనిఖీలు నిర్వహించిన ఎంఈఓలు, కస్టర్ ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.



ఉపాధ్యాయ పోస్టులు తగ్గించేందుకే...

విద్యార్థుల సంఖ్యపై ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు కేవలం ఉపాధ్యాయ పోస్టులను తగ్గించుకునేందుకేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలోకి వస్తూనే మెగా డీఎస్సీ నిర్వహించి టీచరు పోస్టుల భర్తీ చేస్తామని హామీని ఇచ్చి మరోవైపు తనిఖీ పేరుతో ఉపాధ్యాయ పోస్టులను తగ్గించుకునే కార్యక్రమం చేపట్టడం సమంజసంగా లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని బట్టి చూస్తుంటే ఉపాధ్యాయులు, నిరుద్యోగులపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏపాటితో అర్థం చేసుకోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గురువులను అవమానించడం తగదు...



ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌కు అనుగుణంగా విద్యార్థులు లేరనే ఆరోపణలతో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పదేపదే పాఠశాలల్లో తనిఖీలు చేపడుతూ గురువులను అవమానించడం తగదు. ఇది ఉపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసే చర్య. అధికారులు తనిఖీకి వెళ్లిన సందర్భంలో విద్యార్థులు ఏదైనా కారణం చేత గైర్హాజరయితే ఆలాంటి విద్యార్థులను తప్పుడు ఎన్రోల్మెంట్‌గా అధికారులు లెక్కలేస్తున్నారు. ఉపాధ్యాయులను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలి.

-మాదన విజయ కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులను వేధించవద్దు ...



పాఠశాలల్లో విద్యార్థుల నమోదును ఉపాధ్యాయులు ఖచ్చితత్వంతో నిర్వహిస్తున్నారు. దీనిపై వేరే వారితో విచారణ జరిపి ఉపాధ్యాయులను అనుమానించవద్దు. నమోదు విషయంలో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి. విద్యేతర అధికారులతో తనిఖీలు నిర్వహించడం తగదు. దీంతోపాటు తరచూ తనిఖీలతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టవద్దు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను విద్యాశాఖ పరిష్కరించాలి.

-సీవీ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ అమరావతి

వాస్తవ సంఖ్య కోసమే..



గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి అసలైన స్ట్రెంత్ ఎంతుందనే విషయాన్ని తెలుసుకునేందుకే ఎంఈఓ ద్వారా విచారణ జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులు వలసలకు వెళ్తే పిల్లలు కూడా వెళ్తుంటారు. అలాంటి పరిస్థితితేమైనా ఉందా అని పరిశీలిస్తున్నారు. అలాంటి పరిస్థితులకు పక్కాగా తెలుసుకునేందు కోసమే ఈ విచారణ.

- డాక్టర్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

పీఎంజీఎస్‌వై మార్గదర్శకాలు సవరించాలి

- 250+ జనాభా గ్రామాలకు కనెక్టివిటీ కల్పించాలి
- కేంద్ర మంత్రికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినతి



కేంద్ర మంత్రికి సమస్యను వివరిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నాల్గవ దశ మార్గదర్శకాలను సవరించి 250+ జనాభా కలిగిన గ్రామాలకు కూడా రోడ్డు కనెక్టివిటీ కల్పించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. వైఎస్సార్ జిల్లాలో జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె మండలాలను మాత్ర మే ఆకాంక్షిత బ్లాకుల కింద గుర్తించారని తెలిపారు. ఈ రెండు బ్లాకులకే పరిమితం కాకుండా జిల్లా మొత్తంలో ఉన్న 250+ జనాభా గ్రామాలకు కనెక్టివిటీని కల్పిస్తూ మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 500 పైబడి జనాభా కలిగిన అన్ కనెక్టెడ్ హ్యాబిటేషన్లు 3 ఉండగా, 250+ జనాభా గల అన్ కనెక్టెడ్ హ్యాబిటేషన్లు 17 ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాను ఆకాంక్షిత జిల్లాగా గుర్తించిందన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ పీఎంజీఎస్‌వై-4 కింద గ్రామీణ అన్ కనెక్టెడ్ హ్యాబిటేషన్లలో రహదారుల నిర్మాణాన్ని చేపట్టి ప్రభుత్వ సేవలను సత్వరమే ప్రజలకు అందించడమే కాకుండా సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. వైఎస్సార్ జిల్లా వెనుకబడి ఉన్నందువల్ల కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాగా గుర్తించి ప్రస్తుతం రెండు బ్లాకులను ఏర్పాటు చేసిందన్నారు. పీఎంజీఎస్‌వై-4 మార్గదర్శకాలను సవరించి జిల్లా అంతా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు.

సురక్షితమైన బ్రౌజింగ్‌పై అవగాహన

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్: అన్ని రంగాల్లో సురక్షితమైన ఇంటర్నెట్ బ్రౌజింగ్‌ను ప్రోత్సహించడానికి 'సేఫర్ ఇంటర్నెట్ డే' ని విశ్వవ్యాప్తంగా నిర్వహించుకోవడం జరుగుతోందని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. మంగళవారం 'సేఫర్ ఇంటర్నెట్ డే' సందర్భంగా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎన్ఐసీ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు ఒకరోజు వర్క్‌షాపునకు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మన దైనందిన జీవితంలో ఇంటర్నెట్ వాడకం ఒక భాగం అయిపోయిందని, ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ ద్వారా చాలామంది ఎన్నో విధాలుగా ప్రలోభాలకులోను కావడం, హ్యాకర్స్ ద్వారా మన వ్యక్తిగత సమాచారాన్ని కూడా ఇతరులకు చేరవేయడం ద్వారా సొసైటీ పరంగా, ఆర్థికంగా ఎన్నో నష్టాలను చవిచూస్తున్నారన్నారు. ఏ ఒక్కరూ ఆన్ లైన్ మోసాలకు లోనుకాకుండా, సైబర్ నేరాలకు గురికాకుండా మనవైపు నుంచి అన్ని రకాలుగా సైబర్ సెక్యూరిటీ భద్రతల ను పాటించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రోజువారీ జీవితంలో ఇంటర్నెట్ వాడకం, ఇంటర్నెట్ సేఫ్టీ, సైబర్ నేరాలు, బెదిరింపులు, సైబర్ స్వచ్ఛీకరణ పద్ధతులు, సైబర్-క్రైమ్స్ ఫిర్యాదులను టోల్ ఫ్రీ నెంబర్ -1930 ద్వారా ఎలా నివేదించాలి, అనే అంశాలతోపాటు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.స్టే సేఫ్ ఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా సురక్షితంగా ఆన్‌లైన్ వాడకం, ఈ-ఆఫీస్ నిర్వహణ, బ్యాంకింగ్, సోషల్ మీడియా యాప్స్ నిర్వహణ సమయంలో సైబర్ నేరగాళ్ల నుంచి సురక్షితంగా ఇంటర్నెట్ వినియోగించడం ఎలా ? అన్న అంశాలపై డీఐఓ డాక్టర్ విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆయా శాఖల సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

వేంపల్లి: జాతీయ రహదారి నాలుగు లేన్ల రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం పంపిణీలో న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్ భరోసా ఇచ్చారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ సభా భవనంలో చాగలమర్రి - రాయచోటి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, స్థలాలు, పక్కా గృహాలు కోల్పోయే బాధితులతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సమావేశమయ్యారు. బాధితుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు లేన్ల రహదారిలో పంటలు పండే భూములు కోల్పోతున్నామని, ఎకరాకు రూ.3 కోట్లు ఇవ్వాలని జేసీని బాధితులు, రైతులు కోరారు. వేంపల్లెలో భూములకు విలువ పెరగడంతో అధికంగా ధరలు ఉన్నాయని, దానికి తగ్గట్లు రైతులకు నష్టపరిహారమివ్వాలని చెప్పారు. తక్కువ ధర ఇవ్వడ వల్ల రైతులు చాలా నష్టపోతారని అధికారులు ఆలోచించాలని పలువురు రైతులు జేసీ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జాతీయ రోడ్డులో భూములు, స్థలాలు, గృహాలు కోల్పోయే వారికి నష్ట పరిహారస్తామని జేసీ రైతులకు స్పష్టం చేశారు. రైతులు కోరే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. చాగలమర్రి - రాయచోటి జాతీయ రహదారిలో వేంపల్లె మండల వ్యాప్తంగా 127 మందికి చెందిన 42 ఎకరాలు వ్యవసాయ భూమి రోడ్డుకు సేకరించినట్లు చెప్పారు. ఎకరాకు రూ.32 లక్షలు ఇస్తామని భూములు కోల్పోయే బాధితులకు చెప్పినట్లు ఆమె తెలిపారు. రోడ్డుకు సేకరించిన భూములకు కేటగిరీలుగా విభజించి పరిహారం ఇస్తామని, స్థలాలకు, భూములకు, గృహాలకు ధరలను నిర్ణయించి త్వరితగతిన అవార్డును ప్రకటించడం జరుగుతుందన్నారు. కబ్జాకు గురైన భూములపై దృష్టి పెట్టాలని జిల్లాలోని ఆర్డీఓలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఆర్ఐ లోకేష్, వీఆర్ఓలు, రైతులు, బాధితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్

ధర నిర్ణయంపై సమీక్ష

ఎర్రగుంట్ల: జాతీయ రహదారి నిర్మాణానికి భూములు కోల్పోతున్న భూనిర్వాసితులతో ధర నిర్ణయంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జేసీ అదితిసింగ్ రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దనపాడు, వైకోడూరు, యర్రగుంట్ల, హనుమనుగుత్తి గ్రామాల భూములు కోల్పోయ్యే రైతులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. ధరలు కూడా రైతులకు అనుకూలంగా ఉండే విధంగా ధరలు నిర్ణయించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యామని, ఆర్ఐ, సర్వేయర్ పాల్గొన్నారు.

అధికార పార్టీ నేతల అరాచకాలను

కలిసికట్టుగా ఎదుర్కొందాం

- పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: అధికార పార్టీ నేతల అరాచకాలు, అక్రమాలను కలిసికట్టుగా ఎదుర్కొందామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కడప నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నగర జోనల్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యలను పక్కనబెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నేతల వాటర్‌ప్లాంట్లు మూసివేయిస్తున్నారని, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. పేదలకు త్రాగునీటినందించే వాటర్‌ప్లాంట్లను మూయించడాన్ని బట్టే ప్రజలపై వారికున్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ఈ కక్షసాధింపు చర్యలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని, ఎప్పుడు పిలిచినా వస్తామని భరోసా ఇచ్చారు. అనుబంధ సంఘాల నాయకులు కమిటీలను నియమించాలన్నారు. క్రమశిక్షణతో కష్టపడి పనిచేసే వారికి సంఘాల్లో చోటు కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని విధాలుగా సంసిద్ధం కావాలని, పార్టీని కూడా బలోపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ పోరాటం చేయాలన్నారు. ప్రజలు చంద్రబాబు చెప్పిన అబద్ధాల వల్ల ఏం కోల్పోయారో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్‌బోర్డు మాజీ ఛైర్మెన్ పులిసునీల్, జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, జోనల్ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు దీప్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

ఘనంగా లూర్దుమాత తిరునాల



దివ్య సందేశం అందజేస్తున్న బిషప్ గాలి బాలి





లూర్దుమాతస్వరూపానికి పూలమాల వేస్తున్న భక్తురాలు

కడప కల్చరల్: కరుణామయి, ప్రేమమూర్తి ఏసు క్రీస్తును ఈ లోకానికి అందించిన దయగల తల్లి లూర్దుమాత తిరునాల మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మరియాపురంలోని పాత గుడివద్ద బిషప్, కడప అపోస్థలిక పాలనాధికారి గాలి బాలి సమిష్టి బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూర్దుమాత ఆశీస్సులతోనే నవదిన ఉత్సవాలు వైభవంగా నిర్వహించగలిగామని, ఆమెతోపాటు ప్రభువైన ఏసుక్రీస్తుకు దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన లూర్దుమాత దర్శనమిచ్చిన సంఘటనలను వివరించి వాక్యపరిచర్య చేశారు. మరియాపురం క్రీస్తు జ్యోతి కాన్వెంట్ ప్రతినిధులు వేదికను, ప్రార్థనా పీఠాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. సెయింట్ మేరీస్ కేథడ్రల్ గాయక బృందం స్తుతి గీతాలను ఆలపించారు. కడప మేత్రాసనం ఫాదర్లు సంగీత సహకారం, దైవార్చన కార్యక్రమాలను పర్యవేక్షించారు. కడప నగరంలోని డాన్‌బాస్కో ఐటీఐ వద్ద నుంచి భక్తులు మరియమాత స్వరూపాన్ని ఊరేగింపుగా మరియాపురంలోని పాత చర్చి వద్దకు తీసుకొచ్చారు.

తిరునాల సందడే సందడి: లూర్దుమాత నవదిన ఉత్సవాల ముగింపు సందర్భంగా పాత చర్చి ఆవరణలో తిరునాల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలైన ఎడ్ల యజమానులకు అతిథులు బహుమతులు అందజేశారు. తిరునాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఆ ఆవరణం సందడిగా మారింది.



ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



బండను లాగుతున్న వృషభ రాజములు

క్లుప్తంగా

డ్రైవర్లు ఉన్నతంగా ఎదగాలి



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలోని డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు తమ వృత్తిలో రాణించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వద్ద శిక్షణ పొందిన డ్రైవర్లకు అన్ని అంశాల్లో సంపూర్ణ స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. గతంలో తమ వద్ద శిక్షణ పూర్తి చేసుకున్న అనేక మంది రాష్ట్రంతోపాటు దేశ, విదేశాల్లో సైతం తమ వృత్తిలో రాణిస్తున్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత శిక్షణార్థులు కూడా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం అభ్యర్థులు అన్ని విధాలా తమను తీర్చిదిద్దిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ పీఎల్ భాస్కర్, ఇన్‌చార్జి డిపో మేనేజర్ కన్యకుమారి, ట్రైన్ ఎస్‌ఏ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

'వివాద్ సే విశ్వాస్ పథకం' ప్రయోజనకరం



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీధర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : 'వివాద్ సే విశ్వాస్ పథకం' ఎంతో ప్రయోజనకరమని ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ వి.శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కడప నగరంలోని ఐఎంఏ హాలులో కడప ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీధర్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయడం, సకాలంలో పన్నులు చెల్లించడం, ముందస్తు టాక్స్ ప్రాముఖ్యత, మోసపూరిత రీఫండ్ క్లెయిములు, చట్టబద్ధమైన నోటీసులకు జవాబు ఇవ్వకుంటే జరిగే పరిణామాలను వివరించారు. అలాగే 'వివాద్ సే విశ్వాస్ పథకం' ప్రాముఖ్యత గురించి సమగ్రంగా తెలియజేశారు. అర్హులైన వారు కేవలం పన్ను మాత్రం చెల్లించి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ పథకాన్ని వినియోగించుకున్న వారికి ఎలాంటి వడ్డీలు, పెనాల్టీలు, ప్రాసిక్యూషన్ లాంటి శిక్షలు ఉండవు అన్నారు. కార్యక్రమంలో సహాయ ఆదాయపు పన్ను కమిషనర్ కె.శరత్‌బాబు, కడప ఆదాయపు పన్ను అధికారి కె.సత్యనారాయణ, చార్టెడ్ అకౌంట్ ప్రెసిడెంట్ సజన్ కుమార్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రామమూర్తి, ఐటీపీ ప్రెసిడెంట్ జి.వి.శివరావు, జీఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ షరీఫ్ ఖాన్, కడప ఆదాయపు పన్నుశాఖ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వైభవోపేతం.. రంగనాథస్వామి బ్రహ్మోత్సవం

- వేడుకగా ధ్వజా రోహణ

పులివెందుల టౌన్ : భారతదేశంలో మధ్యరంగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్‌శర్మ నేతృత్వంలో అర్చకులు శశిధర్, నాగఫణీంద్ర, రాజసింహశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమాలను నిర్వహించి కలశాలు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల ధ్వజా రోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను శ్రీరంగనాథస్వామి ఆలయం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించే పూలంగళ్ల సర్కిల్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. బ్రహ్మోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి ఈనెల 19 వరకు వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈవో వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్, పాలకమండలి సభ్యులు దశరథ రామిరెడ్డి, కాంబోజి మల్లికార్జున, మేడం దినేష్‌కుమార్, పట్టాభి రామయ్య, బత్తిన శంకర్, ఆలయ సిబ్బంది పురుషోత్తం, విజయ్, రవి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనంపై సతీ సమేతంగా శ్రీరంగనాథస్వామి

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగింపు

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై పులివెందుల పురవీధుల్లో శ్రీరంగనాథస్వామి ఊరేగింపు కొనసాగింది. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామివారు పట్టణంలో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యచంద్రులపై వేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారు సతీసమతుడై పగలు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణుడిని భక్తులు దర్శించి తరించారు. పట్టణంలోని మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాల వారివీధి, అమ్మవారిశాల వీధి మీదుగా స్వామివారు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరాలు సమర్పించి గోవింద నామస్మరణలతో స్మరించుకున్నారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమలలో తలపించే విధంగా బుధవారం శ్రీవేంకటరమణుడు బ్రహ్మ రథోత్సవంపై ఊరేగనున్నారు. బ్రహ్మ రథోత్సవాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 9 గంటల నుంచి పురవీధులలో రథోత్సవం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. కావున భక్తులు రథంలో కొలువుతీరిన శ్రీవేంకటరమణుడిని దర్శించి తరించాలని కోరారు.



సూర్యప్రభ వాహనంపై శ్రీవేంకటరమణస్వామి ఊరేగింపు

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని నందిపల్లె వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిని విచారణ చేయగా అంతర్ రాష్ట్ర దొంగలుగా తేలినట్లు మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ చెప్పారు. పట్టుబడిన దొంగల వద్ద నుంచి 57.54 గ్రాముల బంగారం, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నెల 7న బ్రహ్మంగారిమఠంలో 43.51 గ్రాముల బంగారు చైను, లింగాల మండల పరిధిలో 14.03 గ్రాముల బంగారం, హైదరాబాదులోని కాచిగూడలో రాయల్ ఎన్‌ఫీల్డు బైక్, పల్సర్ బైక్ దొంగతనాలు చేశారన్నారు. ఇవే కాకుండా ప్రొద్దుటూరు పట్టణంలో రెండు చోట్ల కూడా వీరు వివిధ దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

'కూటమి' రాగానే మాపై తప్పుడు కేసులు

- స్థల వివాదంపై గంగిరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుల ఆవేదన



స్థల ధ్రువ పత్రాలు చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్రహ్మంగారిమఠం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థల వివాదంలో యాదవ సామాజిక వర్గం వారు తమపై తప్పుడు కేసులు బనాయించేలా చేస్తున్నారని మండల పరిధి సోమిరెడ్డిపల్లె పంచాయతీ గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అంకిరెడ్డిపల్లె రామిరెడ్డి, లక్ష్మీరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆ గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. సోమిరెడ్డిపల్లెలోని గ్రామ సర్వే నంబరు 54-5ఏలో 78 సెంట్ల వ్యవసాయ పొలాన్ని 1998, 2012లో రెండు సార్లుగా కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా తమ దగ్గర ఉన్నాయన్నారు. అయితే తాము వైఎస్సార్‌సీపీ నాయకులం కావడంతో.. కొంత మంది టీడీపీ నేతల ప్రోద్బలంతో తమకు స్థలాలు అమ్మిన వారితో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇప్పటికే 4 కేసులు బనాయించారన్నారు. అయినా తమ వైపు న్యాయం ఉన్నందున కోర్టుల ద్వారా బయటికి వస్తున్నామన్నారు. తాము కొన్న స్థలాల రిజిస్ట్రేషన్ ఫోర్జరీ చేశామంటూ తప్పుడు కేసులు బనాయించడం మంచి పద్ధతి కాదన్నారు. కేవలం అధికార పార్టీ నాయకుల సలహాలను పోలీసులు సైతం వింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించకుండానే.. తమపై తప్పుడు కేసులు పెట్టడటం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం తమ గ్రామానికి చెందిన వారు కొంత మంది యాదవ సామాజిక వర్గం వారు పశుగ్రాసం తమ స్థలంలో తోలడం, తాము ఏమైనా చేస్తే తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. తామేమి చేయకపోయినా వారే ఆ పశుగ్రాసాన్ని ఏదైనా చేసి తమపై తప్పుడు కేసులు పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అందుకే విలేకర్ల సమావేశం పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు తమ వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలను తమకు అమ్మిన వారిని పిలిపించి రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిశీలించినా తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తమపై తప్పుడు కేసులు బనాయించకుండా పోలీసులు వ్యవహరించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఇరువర్గాలను పిలిపించి మాట్లాడాలని, అలా కాకుండా కేవలం అధికార పార్టీ నాయకులు చెప్పిన మాటలు విని తమపై తప్పుడు కేసులు పెడితే తాము ఊరు వదిలి వెళ్లిపోవాలా అని ప్రశ్నించారు.

విద్యుత్ షాక్‌తో తల్లి, కుమారుడు మృతి

- పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మృత్యువాత
- కాలువ నీటిలో కరెంటు సరఫరా కావడంతో..



మృతి చెందిన వారిని పరిశీలిస్తున్న అధికారులు



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

బి.కోడూరు : పొలంలోని పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన తల్లీ, కుమారుడు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడిన విషాద ఘటన జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బి.కోడూరు మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన కూరాకు గురమ్మ (60), ఆమె కుమారుడు కూరాకు జయసుబ్బారెడ్డి (48) సజ్జ పంటకు నీరందించేందుకు మంగళవారం పొలానికి వెళ్లారు. తల్లి గురమ్మ పొలానికి మడవ కడుతుండగా కుమారుడు జయసుబ్బారెడ్డి మోటారులో నీరు సరిగా రావడం లేదని, అక్కడ మోటారుకు సంబంధించిన పైపునకు అడ్డుగా ఉన్న చెత్త తొలగించేందుకు తెలుగుగంగ కాలువ నీటిలోకి దిగాడు. చెత్త తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోకి విద్యుత్ సరఫరా కావడంతో జయసుబ్బారెడ్డి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఎంతసేపటికీ కుమారుడు రాకపోవడంతో గురమ్మ వెళ్లి చూడగా జయసుబ్బారెడ్డి కాలువలో పడి ఉన్నాడు. ఏమైందో ఏమోనని కుమారుడుని ముట్టుకోవడంతో ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అటుగా వెళుతున్న తోటి రైతులు గమనించి విషయాన్ని బంధువులకు తెలియజేయగా వారు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్‌ఐ కె.సి.రాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటికి తీయించారు. కేసు నమోదు చేసుకుని పోసుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న తల్లి, కుమారుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు జయసుబ్బారెడ్డికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విషయం తెలుపగా స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెక్కును అందజేశారు.



గురమ్మ (ఫైల్)



జయసుబ్బారెడ్డి (ఫైల్)

చోరీ కేసు ఛేదన

అట్లూరు : మండలంలోని ఎగువపల్లి కాలనీలో గతేడాది డిసెంబర్ 6న జరిగిన చోరీ కేసుకు సంబంధించి రికవరీ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అట్లూరు పునరావాస కాలనీలోని ఎగువపల్లి కాలనీలో చెల్లాకొండయ్య ఇంటిలో డిసెంబర్ 6వ తేదీన చోరీ జరిగిందని పేర్కొన్నారు. అదే రోజు చెల్లాకొండయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు చెప్పారు. కొండయ్య సమీప బంధువైన మైనర్ బాలుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని, చోరీకి గురైన 6 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపడం జరిగిందని తెలిపారు.

ఇంటింటా న్యాయ ప్రచారం



మానసిక వికలాంగురాలైన యువతిని పలుకరిస్తున్న బృందం సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ సూచనల మేరకు మంగళవారం కడప నగరం హసింగ్‌బోర్డు కాలనీలో ఇంటింటా న్యాయ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 5622 గృహాలను సందర్శించి 94 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి నివారణ కోసం సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 46 టీములు ఏర్పాటు చేయగా, ఒక్కొక్క టీంలో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటరీ, ఒక ఏఎన్‌ఎం, ఒక ఆశా వర్కర్, ఒక అంగన్వాడీ వర్కర్, ఒక వైద్యాధికారి, భవితా సెంటర్ నిర్వాహకులు ఉన్నారు. అలాగే బృందాలు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా), బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం-2024, వికలాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, బాల్య వివాహాలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14456, ఉచిత న్యాయ సాయం మొదలగు అంశాలను వివరించారు. ఎదుగుదలలో లోపాలుగల చిన్నారులను కడప, ప్రొద్దుటూరులో గల జిల్లా సత్వర చికిత్స కేంద్రం లేదా జిల్లా బాల భవిత కేంద్రంలో సంప్రదించాలని తెలియజేసి తగు సూచనలు ఇచ్చారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటరీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవితా సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జగన్ కృషితోనే ముంపు నుంచి బయటపడిన కడప



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నేతలు
- మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన నిధుల వల్లే కడప నగరం ముంపు బారి నుంచి గట్టెక్కిందని 14వ డివిజన్ కార్పొరేటర్ కె.బాబు అన్నారు. మంగళవారం స్థానికులతో కలిసి ప్రకాష్‌నగర్‌లో వరదనీటి కాలువ సగానికిపైగా పూర్తయిన సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందంటే కడపలో చాలా ప్రాంతాలు మునిగే పరిస్థితి ఉండేదని, నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండు చుట్టు పక్కల వర్షపునీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేదన్నారు. ఈ పరిస్థితిని మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అప్పటి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకుపోవడంతో.. ఆయన వెంటనే స్పందించి మాసాపేటలో వినియోగించాల్సిన రూ.69 కోట్లను వరదనీటి కాలువల నిర్మాణానికి ఉపయోగించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండు నుంచి కోటిరెడ్డి సర్కిల్ మీదుగా బుగ్గవంక, గురుకుల్ విద్యాపీఠ్ నుంచి ముత్రాసుపల్లె మీదుగా చిన్నచౌకు పోలీస్‌స్టేషన్, ప్రకాష్‌నగర్- ఆర్టీసీ బస్టాండు, ఎస్‌బీఐ కాలనీ-బిల్టప్ వంటి చోట్ల వరదనీటి కాలువల నిర్మాణం చేపట్టి దాదాపు పూర్తి చేశారన్నారు. అరకొరగా మిగిలిన పనులు ఇప్పుడు చేస్తున్నారని తెలిపారు. ఇందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, వేణుగోపాల్ నాయక్, త్యాగరాజు, వెంకటేశ్వర్లు, షఫీ, కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుంటాం

- భారతి సిమెంట్స్ సీఎంఓ సాయి రమేష్

కమలాపురం : తమ పరిశ్రమ కేవలం వ్యాపార ధోరణిలో మాత్రమే కాకుండా.. సామాజిక సేవలో సైతం ముందు ఉంటుందని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. ఎర్రగుడిపాడులో ఆధునికీకరించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఐసీడీఎస్ పీడీ శ్రీ లక్ష్మీతో కలసి ప్రారంభించారు. అలాగే సీహెచ్‌ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో కమలాపురం పట్టణంలోని 14వ వార్డు 4వ సెంటర్, 2వ వార్డు అంగన్వాడీ కేంద్రాలను సైతం పరిశ్రమ ప్రతినిధులతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భారతి సిమెంట్స్ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడం లేదన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరుగు దొడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, బస్ షెల్టర్లు, విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక వసతులు కల్పించామన్నారు. అలాగే స్కిల్ ట్రైనింగ్ సెంటర్, డయాలసిస్ సెంటర్ తదితరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లల అంగన్వాడీ సెంటర్లలో అన్ని వసతులు సమకూరుస్తున్నామన్నారు. ప్రస్తుతం 4 సెంటర్లలో పనులు పూర్తి అయ్యాయని, మరికొన్ని సెంటర్లు పూర్తి కావాల్సి ఉందన్నారు. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతోపాటు వాల్ రైటింగ్స్, ప్లే కిట్స్ అందించిన భారతి సిమెంట్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీసీపీఎల్ ఐఆర్అండ్‌పీఆర్ హెచ్‌ఓడీ భార్గవ్‌రెడ్డి, సీఎస్‌ఆర్ హెచ్‌ఓఆర్ నితీష్ కుమార్, సీహెచ్‌ఎఫ్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్ర శేఖర్, మదన్, అంజిబాబు, సీడీపీఓ సుజామణి, సూపర్ వైజర్లు, జయ కుమారి, భారతి, వెంకట సుబ్బమ్మ, అంగన్వాడీ వర్కర్లు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీఎంఓ సాయి రమేష్

13న తలనీలాల వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం ఈ నెల 13వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.రామలింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవదాయ శాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి ఈ నెల 26, 27వ తేదీల్లో రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. డిపాజిట్ నగదు రూపంలో చెల్లించాలని, హెచ్చు పాటదారుడు వేలంపాట ముగిసిన వెంటనే డిపాజిట్‌తో కలిపి మొత్తం నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. అలా చెల్లించని యెడల పాటదారుని డిపాజిట్‌ను అపరాధ రుసుం కింద దేవస్థానం ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం దేవదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ ఓబులేసు, సీసీఎస్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవి కుమార్‌లు తమ సిబ్బందితో కలిసి చైన్‌స్నాచర్స్‌పై దృష్టి పెట్టారు. దేవునికడప రథోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీన మహారాష్ట్ర పునేటౌన్‌కు చెందిన ఆకాష్‌భాస్కర్.. మాడవీధుల్లో స్వామివారు ఊరేగింపు జరుగుతుండగా తన హస్తలాఘవంతో ఏకంగా మూడు బంగారుచైన్‌లను లాక్కెళ్లారు. ఈ సంఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కడప చిన్నచౌక్, సీసీఎస్ బృందాలతో కలిసి చైన్ స్నాచర్ కోసం విస్తృతంగా గాలింపు చర్యలను చేపట్టారు. దేవునికడప ఆర్చి వద్ద నిందితుడైన ఆకాష్‌భాస్కర్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 34 గ్రాముల బరువున్న మూడు బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన చిన్నచౌక్ హెడ్‌కానిస్టేబుళ్లు సి.శివకుమార్, ఎన్.వేణుగోపాల్, ఎస్.ఈశ్వరయ్య, పి.రామచంద్రారెడ్డి, కానిస్టేబుళ్లు పి.వి శ్రీనివాసులు, పి.ఖాదర్‌హుసేన్, ఎస్.ఎంబాషా, వై.ఓబులేసు, సిహెచ్ కేశవరావు, ప్రదీప్‌కుమార్, కె.నాగేంద్రారెడ్డి, సి.సుధాకర్‌యాదవ్, కె. నాగరాజు, కె.మాధవరెడ్డి, ఎస్.పి రంతుబాషా, సీసీఎస్ సిబ్బంది ఏఎస్‌ఐ శివాజీ, హెడ్‌కానిస్టేబుల్ ఎం.వి సాగర్, కానిస్టేబుల్ బాషలను జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ప్రశంసించి రివార్డుల కోసం సిఫారసు చేశారు.